వి. రాజారామ మోహన రావు



# తెర వెనుక ఆనందం

ఆ కొండలమీద నిద్రపోతున్నట్టు నిలబడున్న మేడల్ని ఒక్కొక్క దాన్నే దాటుకు వెడుతోంది కారు. ఆకాశం మీంచి రాలిపడ్డ నక్షత్రాలు నగరం తలలో చిక్కుకుని మెరుస్తున్నట్టు అక్కడక్కడ లైట్లు వెలుగుతున్నాయి. దూరంగా కనిపిస్తున్న ఆ లైట్లని వెనుక బడుతున్న మేడల్ని చూస్తూ కూచుంది వనజ

వెడుతున్న చోటుకొత్త, దానికితోడు ఆ పార్టీ తనకి పిలవని పేరంటం. ఆవిడ పేరు వినటం, సినిమాల్లో చూట్టంతప్ప ఆ రేణుకగారితో పరిచయమైనా లేదు. అందుకని తనురావటం బావుండదని అప్పటికే రెండుసార్లు చెప్పింది సుశీలతో సుశీల వినిపించుకోలేదు... "దాని సంగతి నీకు తెలియదు. నేను న్నానుగా.. నీకెందుకు రా..." అంటూ

ప్రయాణం కట్టించింది. ఆ పార్టీ వాతావరణం, వ్యక్తులూ కొత్తనేకాకుండా అక్కడి ట్రీట్ మెంట్ ఎలా వుంటుందో అన్న అనుమానం కూడా పీకుతోంది వనజని. వెళ్ళటం ఎలాగా తప్పనప్పుడు యిన్నిరకాల ఆలోచనలు అనవసరం అని మనసును సరిపెట్టుకని సుశీల వేపుచూసింది వనజ. సీటుమీద తల వెనక్కివాల్చి ఆకాశంలో దేన్నో వెతుకుతున్నట్టుచూస్తూ కూచుంది. రెండువేపుల్నించీ గాలిచల్లగా వస్తోంది

"ఇంకవచ్చేశాంలే...అదిగో ఆఎత్తుమీద కనిపించటంలే. అందే..." అంది సుశీల.

ఎత్తుమీదుండటంవల్ల దూరంనుంచే కనిపిస్తోంది ఆ బిల్డింగ్. కారు ఆ ఎత్తు ఎక్కుతున్నప్పుడే పోర్టికో కనిపించింది.

పోర్టికో చాలాభాగం కార్లతో నిండిపోయింది. కారుదిగి యిద్దరూ లోపలికి నడిచారు. హాలు గుమ్మందాటి ఓక్షణం నిలబడ్డారు. పాతిక ముప్పైమంది దాకా వున్నారు హాల్లో. ఇద్దరేసి, ముగ్గురేసి విడివిడిగాచేరి కబుర్లూ...నవ్వులూ... మంచి హడావిడగావుంది. ఏం చెయ్యటానికి తోచక వనజ హాలంతా పరికించి చూస్తూ నిలబడింది. సినిమాల్లో చూసే సెట్‌లా కనపడింది.

హాలుమధ్యలో చిన్న పాండ్ వుంది. ఆ పాండ్‌లో నీళ్ళని మెరిపిస్తూ పైన వోపదిపది హేనులైట్లు ...గోడలమూలల్లో ఫ్లవర్ వేజెస్... వాటివక్కనేసోఫాలు... రెండు మూడు పెయింటింగ్స్... కిటికీల్లోంచి కొంతవరకుపాకి ఆగిపోయిన క్రీపర్స్ ... చాలా మోడరన్‌గా కనపడింది వనజకి. కొంతమంది సోఫాల్లో కూర్చుని డ్రింక్స్ తీసుకుంటున్నారు. మరికొంతమంది నిలబడే కబుర్లు చెప్పుకుంటున్నారు.

'ఎంతసేపు యిలా నిలబడాలో'... అని వనజ అనుకుంటుండగా ... ఎడంచేతివేపునుంచి రేణుకవస్తూ కనపడింది.

దగ్గరికివస్తూనే ... "వచ్చి చాలా సేపయిందా...అయినా అలా నిలబడిపోయారే..."అంటూ వనజని సుశీలని వో సోఫాదగ్గరికి తీసికెళ్ళి కూచోపెట్టింది.

"ఇంకో గంటకి యీ హడావిడి అయిపోతుంది. అప్పుడు మనం స్థిమితంగా కూచుందాం ... సరేనా ..." అంటూ సుశీల సమాధానానికేనా ఎదురు చూడకుండా హడావిడిగా వెళ్ళిపోయింది. వెడుతూ వెడుతూ రేణుక డ్రింక్స్ సర్వ్‌చేస్తున్న వాళ్ళకి తమని చూపించి ఏదో చెప్పటం వనజా సుశీలా యిద్దరూ చూశారు.

"ఏపార్టీ అయినా యింతే ... ప్రతి గెస్టుని పెర్‌సనల్‌గా చూడాలని వూరికే హడావిడిపడుతుంది... "అంది సుశీల.

వనజ నవ్వి వూరుకుంది. ఒకళ్ళ

ధగ్గరనుంచి మరొకళ్ళు దగ్గరికి వెడుతూ ఏదేదో మాట్లాడుతోంది రేణుక. రెండు మూడురకాల డ్రింక్స్ అయిదారురకాల డిషెస్‌అందిస్తూ అటూ యిటూ తిరుగుతున్నారు బేరర్స్. తలంటుకున్నతల ... తెల్లటిచీరా ... బ్లౌజ్‌లో గాలికి కదిలే తెల్లగులాబీలా వుంది రేణుక, హాలులో అటూయిటూ నడుస్తుంటే.

సుశీల వాళ్ళాయన గురించి, ఆయన పెట్టిన ఫాక్టరీ గురించి "ఏదేదో చెపుతుంటే వింటూకూచుంది వనజ. పక్క సోఫాలో కూచున్నావిడ వుండి వుండి కొంచెం గట్టిగా నవ్వుతోంది. ఆ నవ్వు అలా గట్టిగా వినపడినప్పుడల్లా కనీసం అయిదారుగురేనా వాళ్ళవేపు చూస్తున్నారు.

ఆవిడ పక్కనున్నతను గ్రేకలర్ సూట్‌లో వున్నాడు, సోఫాలో బాగా వెనక్కి వాలి, కాళ్ళు ఎదురుగావున్న టీపాయ్‌మీదికిజాపి తాపీగా డ్రింక్ తీసుకుంటున్నాడు. పక్కనావిడ సన్నగా పొడుగ్గా వుంది. చీరకి జాకెట్టుకి మధ్య చాలా వొంటిని వొదిలేసింది. ఇంచుమించు అతని భుజాన్ని కౌగలించుకున్నట్టు వోరగా తిరిగి చాలా దగ్గరగా కూచుంది.

అటువేపు నడిచివెడుతున్న చాలా మంది అతన్ని విష్‌చేస్తున్నారు. బదులుగా తలవూపుతున్నాడేతప్ప, కనీసం చెయ్యి కూడా కదపటంలేదు సినిమాల్లో చూసే కొన్ని ముఖాలు కనపడ్డాయి వనజకి అక్కడివాళ్ళలో. మిగిలిన వాళ్ళలో కూడా చాలామంది బహుశా టెక్నీషియన్స్... ప్రొడ్యూసర్లోఅయుంటారు అనుకుం వనజ హాలులోజనాన్ని చూసి.

వో అరగంటకి వొక్కొక్కళ్ళే వెళ్ళటం మొదలెట్టారు. వనజావాళ్ళ పక్కావిడ యింకా అతని మీదమీదకి జరుగుతూ ఏదేదో చెపుతూనేవుంది.

రేణుక తనకూడా వెంటపెట్టుకొస్తున్నాయనిచూసి అంతవరకూ అంత దర్జాగా, పోజుగాకూచున్న తను ఒక్కసారిగా లేచినిలబడి దణ్ణంపెట్టాడు. చేతిలో గ్లాసు కంగారుగా టీపాయ్‌మీద పెట్టేశాడు. ఆవిడకూడా లేచి కొంచెం దూరంగా జరిగి నిలబడింది. అది చూసిన వనజకి కొంచెం చిత్రంగా తోచింది. అంతవరకూ అంత దర్జా... ఒక్కక్షణంలో ఎంత అణుకువా..." అని.

కూడా వున్నాయన్ని తీసికెళ్ళి కూచోపెట్టివచ్చాక... "ఇక అయిపో వచ్చింది...మీరెళ్ళి పైనకూచోండి... వచ్చేస్తా...అని చెప్పింది రేణుక.

సుశీలా వనజాలేచి లోపలికినడిచారు

* * *

మరో అరగంటక్కాని పార్టీ హడా విడి ముగించుకురాలేకపోయింది రేణుక.

ముఖం బాగా అలిసినట్టుంది. వస్తూనే... "అమ్మయ్యా..." అంటూ కూలబడింది సోఫాలో.

"పార్టీ యిచ్చిన ప్రతి రాత్రి అనుకుంటాను ఛస్తే జీవితంలో మళ్ళీ యీ పని పెట్టుకోకూడదని ..." అంది నవ్వుతూ.

"నీలాగే నా క్లోజ్ ఫ్రెండ్... వైజాగ్‌లో ఎమ్. ఎ. చదువుతోందని నీకు చాలాసార్లు చెప్పాను గుర్తుందో లేదో..."అంది సుశీల వనజని పరిచయంచేస్తూ...

గుర్తుందన్నట్టు తలూపింది రేణుక.

"నా పెళ్ళికొచ్చింది ... ఆ తర్వాత తిరిగి యిదేరావటం. అదైనాయీ దగ్గర్లో ఎవరో బంధువులింటికివచ్చి యింక తప్పనిసరై వచ్చింది. వచ్చిందగ్గర్నించి యిల్లొదిలితేనా... ఇక్కడికి తీసుకు రావటానికి రాణీగార్ని ఎంత బతిమాలాల్సి వచ్చిందో ... వెధవ టెక్కూ యిదీను..." అంది సుశీల తిరిగి.

రేణుక నెమ్మదిగా నవ్వింది వనజ వేపుచూస్తూ. ఆప్యాయంగా, స్నేహంగా, వుందానవ్వు. అది చూశాక వనజకి అంతవరకూవున్న మొహమాటంకొంచెం తగ్గింది. మరికాస్సేపటికి ... "మీరు సుశీలొకటి నేనొకటీ కాదు." అని రేణుకనటంతో మరింత చొరవేర్పడింది.

కాస్సేపు ఆ కబురూ యీ కబురూ అయ్యాక ఆ చొరవతోనే యిందాకా తమపక్క కూచున్నవాళ్ళగురించి అడిగింది వనజ రేణుకని.

"ఆయనపేరు రమానాథ్. యీ మధ్యనే పైకొస్తున్న డైరక్టర్ ... ఆవిడో కొత్త హీరోయిన్. ఓసినిమాలో బుక్ అయింది యీమధ్యే ... ఆ సినిమాకి రమానాథే డైరక్టర్ ... ఆ తర్వాత నా కూడా వచ్చారు చూడండి ఒకాయన. ఆయన ప్రొడ్యూసర్... పెద్ద ప్రొడ్యూసరని ఫీల్డ్‌లో చాలా పేరుంది... ఏం?..." అంది రేణుక.

"అబ్బే ఏంలేదు వూరికినే..."అంది వనజ.

దానికి రేణుక నవ్వింది..."ఎందుకు మొహమాటం ... మీరెందుకు అడిగారో నాకుతెలుసు...ఆవిడనవ్వటం ...దగ్గర దగ్గరగావుండటం. దాని గురించేగా అడుగుతున్నారు. మీకు కొత్తగా వుంటాయి యివన్నీ ... మాకు మామూలే... "అంది రేణుక. ఆ సందర్భంలోనే ఫీల్డ్ గురించి చాలాసంగతులు చెప్పింది రేణుక. కొత్తగా యీ రంగంలోకి అడుగుపెట్టే వాళ్ళ యిబ్బందులు, అనుమానాలు, భయాలు, తన అనుభవాలు అలా చాలా సేపు చెప్పింది.

అలా చెపుతూనే "ఈనాడు నాకీ యిళ్ళు, కార్లు, అందరిలో గౌరవం యివన్నీవున్నా, ఎప్పుడేనా తాపీగా కూచుని గతాన్ని గుర్తుతెచ్చుకుంటే గుర్తొచ్చేది కొత్తలో పడినయిబ్బందులే.



ఆనాడు ఎవరి అండాలేకుండా యీ మహానగరానికి వచ్చాను. జీవితం ముందు ముందు ఏమవుతుందోనని భయం,వచ్చిన అవకాశాన్ని నిలబెట్టుకోగలనా లేదా అన్న ఆందోళన...చుట్టుపక్కల యీ రంగంలోవాళ్ళు. పన్నే వుచ్చులు. ఆ రోజులు యిప్పుడు గుర్తుతెచ్చుకుంటేనే భయంగా వుంటుంది. కానీ ఏంచెయ్యటానికీ తోచక, మరో దారిలేక నిబ్బరంగా అన్నిటికీ తట్టుకోక తప్పిందికాదు..." అంది రేణుక.

సుశీల అంతకుముందు చెప్పినవాటిని బట్టి, యిప్పుడు విన్నవాటినిబట్టి యీ రంగంలో ప్రవేశించి నిలదొక్కుకోటానికి ఎన్నియిబ్బందులు పడిందో, ఎన్ని అవమానాలు ఎదుర్కొందో చాలావరకు వివరంగా తెలిసింది వనజకి. తెరమీద చూసే మెరుపుజీవితమేకాకుండా, తెరవెనుక జీవితంకూడా గ్రహింపుకొచ్చింది.

"ఈనాటి యీ స్థితి నేను నిలబెట్టుకోగలిగితేచాలు... అంతకన్నా ఏంఅక్కర్లేదు యీజీవితానికి..." అంది చివరకి రేణుక.

ముగ్గురూ భోజనాలకి లేచారు.

భోజనాలవుతుండగా మధ్యలో... "సుశీలా డైటింగ్‌మీద ఆ పుస్తకం తెచ్చావా..." అనడిగింది రేణుక.

"లేదు ... ఆయన రేపు తెస్తా

నన్నారు... ఆఫీసులో మర్చిపోయారట." అంది సుశీల. అని ఏదో గుర్తొచ్చిన దానిలా నవ్వింది. ఎందుకు నవ్విందో అర్థంకాలేదు వనజకి. రేణుకకి కూడా అర్థమైనట్టులేదు.

"వూరికే డైటింగ్, డైటింగ్ అనటం...పుస్తకాలు తెప్పించటంతప్ప తిండి తగ్గించటమే మేనావుందా ? కిందటి సారి నేచూసిందానికన్నా లావెక్కావు" అంది సుశీల అలాగే నవ్వుతూ.


రేణుక కూడా నవ్వింది. అంతవరకూ రోజాపువ్వులావున్న ఆముఖం ఎండ దెబ్బతగిలినట్టు వాడిపోయింది కంచంలో చెయ్యి అలాగే వుండి పోయింది.

"నిజమే సుశీలా...నాతాపత్రయమే తప్ప నేను డైటింగ్ చెయ్యలేనని తెలుసు. రోజురోజుకి లావవుతున్నాననీ తెలుసు. ఇలాగే వూరుకుంటే నా భవిష్యత్తు కెరీర్ దెబ్బతింటాయనీ తెలుసు. కానీ ఏం చెయ్యను ? తిండిమీద అంక్షపెట్టు కోవాలనుకున్నప్పుడల్లా ఆరోజులు గుర్తొస్తాయి...రెండేసిరోజులు పస్తుండే నాట కాలేసినరోజులు... కాఫీనీళ్ళతో స్టూడియోల చుట్టూ తిరిగిన రోజులు...ఉన్న రెండుముద్దలఅన్నం చిన్నపిల్ల చెల్లాయి కమలతో భాగం పంచుకోలేక, ఆకలికి తట్టుకోలేక గిలగిలలాడినరోజులు. అన్నంముందు కూచున్నప్పుడల్లా అవన్నీ కళ్ళముందు కదులుతాయి. ఈ నాడు నాకు జీవితాంతం కడుపునిండా తినగలిగినంత అస్థుంది ... నలుగురికి పెట్టగలస్థోమతుంది. అందుకనే బతుకు ముందు ఏవైనానరే అనిపిస్తుందితప్ప అర్థాకలి తింటానికి మనసొప్పదు." అంది రేణుక ... కళ్ళఅంచులవరకూ వచ్చి దారివెతుకుతూ కదిలాయికన్నీళ్లు. అవి చూసిన వనజ సుశీలకూడా కన్నీళ్ళొచ్చాయి.

"తట్టుకోలేని ఆకలేసినప్పుడు కడుపునిండా అన్నంతినటం, కళ్ళు మూసుకుపోయేటప్పుడు తృప్తిగా నిద్ర పోవటంకంటే జీవితంలో మించిన సుఖం, సంతోషం ఏముంటుంది చెప్పు సుశీలా ? కానీ యీ రంగంలో వ్యక్తులు వాటిని మించినవి వుంటాయంటారు. పొజిషన్...స్టేటస్...గ్లేమర్... వాటి కోసం తాపత్రయం ఆ సంఘర్షణలోనే వున్నాను. అందుకనే నిన్నూ నిన్నూ పుస్తకాలు, సలహాలు అడగటం. ఇంక ముందేమవుతుందో తెలియదు కానీ యింతవరకూ యింకా జీవితంలోని ఆనందాన్ని పూర్తిగా చంపుకోలేదు నేను..." అంది రేణుక వాళ్లని సాగ నంపటానికి కారుదాకావస్తూ.

కొండలమీంచి కారునెమ్మదిగా దిగుతోంది. గాలి మరింత చల్లదనానికి మళ్ళింది చీకటిలో జారిపోతున్న రోడ్డునిచూస్తూ కూచుంది వనజ.

"ఏ విషయంలోనూ వోనిర్ణయానికి




రాలేక నందేహంలో బతికేవాళ్ల జీవితం యింతే..." అంది సుశీల నెమ్మదిగా, రేణుక గురించే అంటోందని గ్రహించింది వనజ.

"చిన్నప్పట్నించి దాని తీరే అంత. దానికి కావాల్సింది వేరు...జీవితం అందిస్తున్నది వేరు. తండ్రిపోయాక తప్పనిసరై, రోజులు గడపటానికి నాటకాలేసింది. రేణుక అయిష్టంగానే ఆ పని చేస్తోందని నాకు తెలుసు. వచ్చి నాతో వుండిపొమ్మని బతిమాలాను ... పరిస్థితంతావిని నాన్నగారుకూడా వొప్పుకున్నారు. కాని యిదివింటేనా ? అభిమానం. అలాగే నానా తంటాలుపడింది. పోనీ అన్ని కష్టాలుపడి యీ స్థితి కొచ్చింది... యీనాడేమేనా తృప్తిగా వుందాంటే అదీలేదు.

రెండేళ్లనుంచీ వో డైరక్టర్‌తో మేరేజి ప్రపోజల్ వుంది. ఆ విషయంలో వో నిర్ణయానికి రాలేదు. ఏవేవో సందేహాలు. ఆ ఫీల్డ్ వదిలి రాలేదు. అందులో యిమడనూలేదు. ప్రతిక్షణం నవ్వుతున్నా ననుకుంటుంది...ఆనందంగా గడుపుతున్నా ననుకుంటుంది. మననికూడా అలాగే అనుకోమంటుంది. ఇంకా జీవితాన్ని ఎన్నాళ్ళిలా గడుపుతుందో..." అంది సుశీల

సుశీల అన్నమాటలు ...ఆగొంతులో బాధ అన్నీ వింది వనజ.

"కారణాలు ఏవైనా చాలామంది జీవితాల్లో నిజమైన ఆనందాలు చచ్చిపోతున్నాయి" అనుకుంది. చీకట్లో జారిపోతున్న రోడ్డుని, నగరం తలలో అక్కడక్కడ చిక్కువడ్డ నక్షత్రాల మెరుపుని చూస్తూ...